# చిత్రలోకం

'సినిమాకు కథ కూర్చడం చాలా కష్టం!' అని- సినీఫీల్డులో తిరిగే మా మిత్రుడొకడు ఈమధ్య హైదరాబాదు నుంచి ఉత్తరం రాశాడు.

వాడి 'కథాకమామీషు' ఏమిటో చూద్దామనిపించి- ఆఫీసు పనిమీద హైదరాబాదు వెళ్లినపుడు వాడుంటున్న హోటలుకు వెళ్లాను. మనవాడు నిర్మాతల పాలిట 'పారసైట్' కాబట్టి హోటల్ వైస్రాయ్‌లో దర్జాలు వెలగబెడుతున్నాడు.

కాలింగ్ బజర్ నొక్కాను.

"హాయ్ఁ... నువ్వా... ఎప్పుడొచ్చావ్?"

ఎమ్మెల్యే పంచెకట్టు, సిల్కు లాల్చీ, మెడలో పులిగోరు పతకం, ఒక చేతిలో వెలుగుతున్న సిగరెట్, మరో చేతిలో త్రిబుల్ ఫైవ్ సిగరెట్ పేకెట్... ఫారిన్ స్ప్రే సువాసనలతో మనవాడు ఘుమఘుమలాడుతున్నాడు.

"పొద్దున్నే... గౌతమికి దిగాను!"

ఏదో పెద్దజోక్ చెబితే పేలినట్లు పగలబడి నవ్వాడు.

ఇదీ సినీ స్టైలేనన్నమాట!

"పోనీలే... ఇప్పటికైనా దారిలోకి వచ్చావు! పత్రికలకు పిచ్చికథలు రాస్తుంటే ఏం గుర్తింపు వస్తుంది? ఒక్క సినిమాకు పని చేశావనుకో... ఒక్కసారి సిల్వర్ స్క్రీన్ మీద నీ పేరు పడిందనుకో... ఇంక వెనక్కు తిరిగిచూసే పని వుండదు."

మావాడు మల్టీకలర్ పిక్చర్‌లోకి నన్ను తీసుకువెళ్లిపోతున్నాడు.

"స్టాప్... స్టాప్! అంత సీను లేదులే! నీతో సరదాగా నాలుగు రోజులు స్పెండ్ చేద్దామని వచ్చాను" అన్నాను.

"పోనీలే! ముందు ఈ పంచరంగుల లోకం చూస్తేనైనా తరువాత నీ మనసు మారకపోదులే!"

"నువ్వెన్నైనా చెప్పు... నేను మారే ప్రశ్న లేదు. ఈ ఊబిలో దిగి మునగలేక, తేలలేక బాధపడదలచుకోలేదు నేను."

మావాడు పది సంవత్సరాల నుంచి సీనియర్ సినీరైటర్స్ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు. సీనియర్ నిర్మాతలకు వెట్టిచాకిరీ చేస్తున్నాడు. ఈ కార్యక్రమం వేరే ఎక్కడైనా చేస్తే పైకి వచ్చేవాడు.

"పోనీలే... మంచి టైముకు వచ్చావు. మేం ఇప్పుడు స్టోరీ డిస్కషన్ సెషన్స్‌కి వెళ్తున్నాం. పద... సరదాగా మాతో సిట్టింగ్‌లో కూర్చుందుగాని! 'కదంబకుమార్' అనీ... ఒక ఫేమస్ రైటర్ వున్నాడు. ఆయన సినిమాలకు ప్లాట్లు అమ్ముతుంటాడు. ఎక్కువగా ఇప్పుడు వచ్చే సినిమాలన్నీ ఆయన దగ్గర కొన్న ప్లాట్లలోనే తయారవుతున్నాయి."

'ఓహోఁ...

ఇళ్ల ప్లాట్ల కొనుగోళ్ళే కాకుండా- సినిమా కథల ప్లాట్ల కొనుగోళ్ళు, అమ్మకాలు కూడా వుంటాయన్నమాట! అందుకే చలనచిత్రలోకం 'మాయాలోకం' అంటారు. 'అసలు సినిమా అంటేనే మాయ కదా! హీరో రిక్షా తొక్కుతూ ఇంద్రభవనం లాంటి బంగళాలో నివసించే అమ్మాయిని ఛాలెంజ్ చేసి మరీ ప్రేమించేసి పెళ్ళి చేసుకుంటాడు కదా! మరి, ఎలా చేసుకుంటాడు? నిజ జీవితంలో సాధ్యం కాని పని కదా!'

హోటల్ బయట కారు ఆగివుంది...

నేను, మా మిత్రుడు కారు ఎక్కాం!

మావాడు ఒక పక్కన సిగరెట్ కాలుస్తూనే, మరో చేతిలో పాన్‌పరాగ్ డబ్బా నోట్లో వంపుకుంటున్నాడు. దమ్ము మీద దమ్ము త్రిబుల్ ఫైవ్ సిగరెట్స్ తగలేస్తున్నాడు. టెన్షన్ అన్నమాట! ఎవరో వెనకటికి సామెత చెప్పినట్లు 'నా సొమ్ము కాకపోతే...' అన్నట్టు వుంది మావాడి పరిస్థితి!

చిక్కడపల్లిలో గల్లీలన్నీ తిరిగి తిరిగి ఒక చిన్నగల్లీలో, ఒక ఇంటి ముందు కారు ఆగింది. కారు దిగగానే గూర్ఖాలాంటి ఓ వ్యక్తి కారు దగ్గరికి వచ్చాడు.

"పదకొండు గంటలకు ఇంటర్వ్యూ టోకెన్ మీదేనా?"

"అవునండీ..." అన్నాడు మావాడు వినయంతో.

"పదకొండు గంటల నలభై ఐదు నిముషాలకు వేరే పార్టీ వస్తున్నారు. మీరు త్వరగా కానియ్యండి!" అని హెచ్చరించాడు ఆ గూర్ఖా.

'ఓరినీ... ఇంత డిమాండ్ వుందన్నమాట ఈయనకి!' అనుకున్నాను.

మేం లోపలకు వెళ్లాం.

ఆయన ఖద్దరుసిల్కు లాల్చీ వేసుకున్నాడు. పంచె కట్టుకున్నాడు. నుదుట విబూది రేఖలు, రూపాయి కాసంత బొట్టు, ఆ బొట్టు చుట్టూ గంధం లైనింగ్, మెడలో రకరకాల రుద్రాక్ష మాలలు. ఆయన ముందు ఒక గుండ్రని ఇత్తడి పళ్ళెం వుంది. ఆ పళ్ళెంలో చాలా సరంజామా వుంది.

"నమస్తే..." అన్నాడు మావాడు.

నేను కూడా మర్యాదపూర్వకంగా "నమస్తే!" అన్నాను.

"సత్యసాయి వెంకటదుర్గా శివాని పిక్చర్స్ తాలూకాయేనా మీరు? ఈ పూట స్టోరీ డిస్కషన్స్ మీవే కదా?" అన్నాడాయన.

"అవును సర్..." అన్నాడు మావాడు అతివినయంగా.

ఆయన... అనగా కదంబకుమార్- తన ఎదురుగా వున్న తళతళా మెరిసే ఇత్తడి పళ్ళెంలో వున్న విక్స్‌సీసా తీసి నుదుటికి, ముక్కుకి పట్టించుకున్నాడు.

ఒకసారి గొంతు సవరించుకున్నాడు. ముక్కుపొడుం డబ్బా తీసుకుని ఒక అరతులం నశ్యాన్ని ముక్కులోకి రవాణా చేశాడు.

ఒక బీడీ వెలిగించాడు. దాన్ని ఓ రెండు దమ్ములు లాగిపారేశాడు. తరువాత ఆరు అంగుళాల లంకపొగాకు చుట్ట వెలిగించి రైలింజను పొగలాగా అందరి మీదకు వదిలాడు.

ఈలోగా ఏదో గుర్తుకువచ్చినట్లు పాన్‌పరాగ్ డబ్బా ఓపెన్ చేసి గొంతులోకి వొంపుకుని, డబ్బా పక్కకు విసిరేశాడు.

'వీడు మనిషేనా?' అనుకున్నాను వాడి చేష్టలు చూసి.

"అదీ సంగతి! ఇప్పుడు నాకు మూడ్ వచ్చింది. చెప్పండి... మన సినిమా సోషలా? సోషియో ఫాంటసీనా? సోషియో పొలిటికలా? పొలిటికల్ సెటైరా? లేదా సెంటిమెంటల్ ట్రాకా? ఇవేవీ కాకుండా కామెడీయా?" అన్నాడు ఒక్కసారి సర్దుకుని కూర్చుని.

నాకు ఆయన కదలికలు చూస్తే- ఆయన సేవించే పదార్థాల వల్ల ఆయన భారీ శరీరంలో ఏదో రసాయనిక చర్య జరిగి, అంతటి భారీకాయం కాస్తా ఎప్పుడో పెద్దశబ్దం చేసి ఒక్కసారిగా బద్ధలైపోతుందేమోననిపిస్తోంది. పాపం శమించుగాక!

"మీకు ఇంతకుముందే చెప్పానులెండి! అయినా పెద్దవారు- మీకు ఎక్కడ గుర్తుంటుంది? మేం అనుకునేది సోషియో సెంటిమెంటల్ పిక్చర్!"

"అలాగా..." అంటూ-

"ఎవరక్కడ?" అన్నాడు కొలువుతీరిన సభలో రాజుగారు అరిచినట్టు.

"యస్సర్!" అంటూ గూర్ఖాలాంటి వాడు వచ్చాడు.

"నెంబరు తొమ్మిది డబ్బా పట్టుకురావోయ్!" అన్నాడు.

వాడు లోపలకి వెళ్లి 'నంబరు తొమ్మిది' అని పెయింట్ చేసివున్న డబ్బా తెచ్చాడు. ఆ డబ్బా పోపుల డబ్బాలా వుంది.

మిస్టర్ కదంబకుమార్ ఆ పోపులడబ్బా తెరిచి-

"ఇందులో ఆరు డబ్బాలున్నాయి. ఒక్కో డబ్బాలో ఒక్కో చీటీ తియ్యండి... ఆ చీటీల ప్రకారం మీకు కథ చెప్తాను" అన్నాడు.

'చిలక ప్రశ్న' లాగా ఇదేదో బాగానే వుంది. అంటే... రెడీమేడ్ కథలు బిట్లుబిట్లుగా వుంటాయన్నమాట! ఇవన్నీ కలిపి- పూసలన్నీ గుచ్చి ఒక దండ చేసినట్లు సినిమా కథ తయారవుతుందన్నమాట!

అద్భుతంగా వుంది.

మావాడు ఆత్రంగా డబ్బా దగ్గరకు లాక్కున్నాడు.

మూత తీయగానే... అందులో స్టంట్స్- డ్యూయెట్స్ - సెంటిమెంట్స్- వాన పాటలు- క్లబ్‌డాన్సులు- క్లైమాక్స్ సీన్స్... అని ఆరు డబ్బాలకు టైటిల్స్ రాసి వున్నాయి.

మావాడు స్టంట్స్‌లో రెండు చీటీలు, మిగతా వాటన్నింటిలో తలా ఒక చీటీ తీశాడు.

కదంబకుమార్ మళ్లీ ఒకసారి సర్దుకొని కూర్చుని, విక్సీసాతో మొదలెట్టి, ఇంకో పాన్‌పరాగ్ డబ్బా సగంఖాళీ చేసేవరకూ తన 'కార్యక్రమం' పూర్తిచేసి, మళ్లీ ఒకసారి తన శరీరాన్ని కుదేసి, కుదురుగా కూర్చుని "ఇలా ఇవ్వండి!" అన్నాడు.

తను తీసిన చీటీలన్నింటినీ అతిభద్రంగా ఆయన దోసిట్లో పోశాడు మావాడు.

'చిలకజోస్యం'లో చిలక తీసిన చీటీ చూసి, వచ్చిన వాడి ముఖం చూసి చిలకజోస్యం చెప్పేవాడు ఫీలింగ్స్ పెట్టినట్లు- మన 'కదంబకుమార్' ఫీలయిపోతున్నాడు. నవ్వితే ఆయన ముఖం వికృతంగా తయారైంది.

"మిస్టర్! మీ బ్యానర్ విజయా బ్యానర్ టైపులో హిట్టయిపోతుంది. మీరు స్టంట్స్‌లో తొమ్మిదో నంబరు, డ్యూయెట్స్‌లో ఎనిమిదో నెంబరు, సెంటిమెంట్స్‌లో ఆరో నెంబరు, వానపాటల్లో పన్నెండో నెంబరు, క్లబ్‌డ్యాన్స్‌ల్లో పంతొమ్మిదో నంబరు! అబ్బఁ... అదిరి పోయిందండీ! మీ పిక్చర్ 'ఎన్ని సంవత్సరాలు ఆడుతుంది?' అని అడగండి. ముందుగా వంద రోజులకు, రెండు వందల రోజులకు, మూడు వందల రోజులకు, సంవత్సరం పండగలకు షీల్డులు తయారుచేయించండి.

ఇక కథలోకి వెళ్దాం -

మొదట పిక్చర్ బిగిన్ అవుతుంది. హీరోయిన్‌ని రౌడీలు ఏడిపిస్తుంటారు. హీరో తన సైకిల్‌తో రౌడీలను చిత్తుచిత్తు చేస్తాడు. హీరో మీద శత్రువర్గం వాళ్ళు బాంబులు కూడా విసురుతారు. అయినా మన హీరో సేఫ్! చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది. ప్రేక్షకులు కుర్చీల్లోంచి లేచి నుంచుంటారు. ఇది ఫైటింగ్ సీన్ నెంబర్ తొమ్మిది-

వెంటనే హీరోయిన్‌తో డ్యూయెట్స్! ఎనిమిదో నెంబరులో చాలా పాటలు వున్నాయి. మన దేశంలో గాని, విదేశాలలో గాని చిత్రం బడ్జెట్‌ని బట్టి చిత్రీకరించుకోవచ్చు. అందులోనే మచ్చుకు కొన్ని పాటలు పెట్టాం. పచ్చిబూతుల నుంచి మంచిసాహిత్యం వరకు అన్నీ వున్నాయ్... అవి మీ ఇష్టం!

తరువాత అసలు కథ!-

హీరో చిన్నప్పుడు పాలు తాగే వయసులో తనను వదిలేసిన తల్లిదండ్రులను గుర్తుపడతాడు, కలుస్తాడు. వాళ్ళు అలోపాలోమని ఏడుస్తారు. బోల్డంత సెంటిమెంట్! ఆడోళ్ళు ఏడ్వడానికి చాలా సీన్స్ వున్నాయి.

ఇక మరి 'మసాలా' కావాలి కదా..." అంటూ, పాన్‌పరాగ్ డబ్బా తీసి సగం డబ్బా నోట్లో వేసుకుని-

"హీరో హీరోయిన్లతో వాన పాట, సీన్ నెంబర్- అబ్బో... అదిరించండి. ఈ హీరోయిన్ పాటలో మొత్తం ఒక్కొక్క వస్త్రం విప్పుతూ అంధాలు ప్రదర్శిస్తుంది. అయ్‌మీన్... అసలు హీరోయిన్ వంటిమీద వుండేవి పీలికలే అనుకోండీ... అంటే- ఈ సీన్‌లో అవి కూడా తీసేస్తుందన్నమాట!" అంటూ గారపట్టిన ముప్పయ్యారు పళ్ళు కనిపించేట్లుగా నవ్వాడు.

"తరువాత విలన్ డెన్‌లో వ్యాంప్ డ్యాన్స్ పాట! అబ్బబ్బఁ... మీరు మేధావి వర్గం వాళ్ళు సుమా! క్లబ్‌డ్యాన్స్‌లో డ్యాన్సర్‌కి బట్టలు అసలే వుండవు. అలా అని అసలు బట్టలు లేకుండా వుండవండి. అబ్బేఁ... అలా భ్రమింపచేస్తాం- లేకపోతే సెన్సారోళ్ళు వున్నారు చూడండీ... ఈమధ్య మనల్ని చిత్రహింసలు పెట్టేస్తున్నారు లెండి!

ఇక- క్లైమాక్స్ నెంబరు పంతొమ్మిది! ఈ సీనే యాభై లక్షల రూపాయల ఖరీదు చేస్తుందండి.

హీరోని శత్రువులు ఒక గుడిసెలో బంధిస్తారు. గుడిసెకు నిప్పు పెడతారు. హీరో క్షణంలో తన చేతులతో సొరంగం తవ్వుకుని బయటకు వచ్చేస్తాడు. కాలిన గాయాలతో బయటకు వచ్చి అందర్నీ చితకగొట్టి హీరోయిన్ని పెళ్ళి చేసుకుంటాడు.

ఎలావుంది 'మిర్చిమసాలా కథ?" అంటూ వెకిలినవ్వు నవ్వుతున్నాడాయన.

ఆయన నోట్లోంచి పాన్‌పరాగ్, చుట్ట వగైరాలు వాసనలు వెదజల్లుతుంటే... ఆ తుంపర జల్లు మమ్మల్ని తడుపుతోంది.

నా మిత్రుడు పరమానందపడిపోతున్నాడు.

'ఎలా వుండటమేమిటి... నీ బొంద, భోషాణం! ఇలాంటి కథలు రోజుకు శతాధికాలు తయారుచేయగలను. కథ అంటే పోపులడబ్బాలో సరుకులతో పోపు వేసినట్లేనా?' అని అనుకుంటున్నాను నాలో నేను.

ఈలోగా-

కదంబకుమార్ నా భుజం చరిచి "ఏమండీ... ఎలావుంది కథ?" అన్నాడు. నా భుజం ఊడిపోయినట్లయింది.

"అద్భుతంగా వుందండి... ఒక సంవత్సరం మినిమమ్ గ్యారంటీ!" అన్నాను.

"వెల్‌సెడ్..." అని ఈసారి నా వీపు మీద ఒక గుద్దు గుద్దాడు. నా వెన్నెముక పూసలు లూజ్ అయినట్లనిపించాయి.

"ఇప్పుడు నేను మీరు ఎన్నిక చేసుకున్న అయిటమ్స్ అన్నీ బ్రీఫ్‌గా చెప్పాను. ముందుగదిలో సెక్రెటరీ వుంది. ఆమె దగ్గర వివరంగా ప్రింటెడ్ మెటీరియల్ వుంటుంది. డబ్బు కట్టి తీసుకోండి. అందులో స్క్రీన్‌ప్లే కూడా వుంటుంది. ఆ మెటీరియల్ తీసుకువెళ్లండి. ఆc... అన్నట్లు ముహూర్తానికి పిలవడం మర్చిపోకండి" అంటూ కదంబకుమార్ తన ముందున్న పళ్ళెం దగ్గరకు లాక్కున్నాడు.

'అమ్మోc... నేను ఆ హింస చూడలేను!' అనుకుంటూ మావాడిని ఫాలో అయ్యాను.

"ఏంటి అంటున్నావ్?" అన్నాడు మావాడు.

"మొత్తానికి కదంబకుమార్ ఒక జీనియస్!" అన్నాను.

"ఏంటనుకుంటున్నావు? ఇలాంటోళ్ళు హైదరాబాదులో చాలామంది వున్నారు. ఈయన ఇంటర్వ్యూ నెలక్రితం ఫిక్స్ చేశాం. తెలుసా?" అన్నాడు వాడు.

'కాకినాడ వెళ్లాక ఇలాంటి పోపులడబ్బాలు నేనూ తయారుచేస్తే బాగుండు!' అనుకుంటూ మావాడిని అనుసరించాను.

తరువాత కొన్నాళ్లకు-

'మిర్చిమసాలా' సినిమాకు ముహూర్తం ఆహ్వానం వచ్చింది నాకు!

●

' ఈనాడు ' దినపత్రిక ( ఆదివారం ) ... 23 జూన్' 1996 సంచికలో ప్రచురితం